రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# కోట్‌పల్లి ప్రాజెక్టు కింద పూర్తిస్థాయిలో
# ఆయకట్టుకు నీరు అందించాలి

-రెండు నెలల్లో పనులు పూర్తి కావాలి
-నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవు
-జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :
కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా 9200 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే విధంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు.బుధవారం నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు,ఎంపిడివోలు,సంబంధిత శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శించారు.కోట్‌పల్లి ప్రాజెక్ట్ కుడి,ఎడమల కాల్వల ద్వారా సమృద్ధిగా ఆయకట్టుకు నిరందించేందుకు గాను కాల్వల మరమ్మతు పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.దారూర్ మండలంలోని నాలుగు గ్రామపంచాయతీల పరిదిలోని 1100 ఎకరాలకు, పెద్దముల్ మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు 8100 ఎకరాలకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు అందించకుండా ప్రస్తుతం 50శాతం మాత్రమే వ్యవసాయానికి నీరు అందించేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ఏప్రిల్ ,మే రెండు నెలలు జాతీయ ఉపాధి హామి పథకం కింద కూలీల సంఖ్యను పెంచుతూ పనులను వేగవంతం చేసి రెండు నెలలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులకు నీరుందించే దిశగా జిల్లా యంత్రాంగం పూర్తి సహకారాన్ని అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. నిర్దేశించిన సమయంలోపు పనులు పూర్తికానట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.గ్రామాల్లో సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,వార్డు సభ్యులు,రైతు సమితి గ్రామపెద్దలతో గ్రామసభలు నిర్వహించి ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తించి అంచనాలను రూపొందించి పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ఏప్రిల్ మాసం నుండి యంత్రాలను ఉపయోగించకుండా ఉపాధి హామీ కూలిలతో పనులు మొదలు పెట్టాలని కలెక్టర్ తెలిపారు.జాతీయ ఉపాధి హామి పథకం కింద రోడ్ల ఏర్పాటుకు అవసరాల మేరకు గ్రామపంచాయతీల ట్రాక్టర్లను వినియోగించుకోవాలని సూచించారు.ఆయకట్టు కింద వ్యవసాయ చేసుకుంటున్న రైతులు తమ పొలాలలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదని కలెక్టర్‌ను అభ్యరించగా దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.కలెక్టర్ పర్యటనలో నీటిపారుదలశాఖ ఇఇ సుందర్ నాయక్,దారూర్,పెద్దెముల ఎంపిడివోలు,ఎంపివోలు,ఎపిఓలు,నీటిపారుదల శాఖ డిఈ,ఏఇలు, పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీ కేసును సిబిఐకి అప్పగించాలి

-వెంటనే జనార్ధన్ రెడ్డిని తొలగించాలి : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**పరిగి మార్చి15,ప్రభాతవార్త :** పేపర్ లీకేజీ కేసును సిబిఐకి అప్పగించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం పరిగి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ....గ్రూప్ 1 ప్రిలిమ్స్ రద్దు చేయాలని పేపర్ లీకేజీ కేసును సిబిఐకి అప్పగించాలని అన్నారు.త్వరలో గవర్నర్,రాష్ట్రపతికి లేఖ రాస్తానని స్వచ్ఛందంగా జనార్ధన్ రెడ్డి వైదొలగాలని పేర్కొన్నారు.30 లక్షల మంది నిరుద్యోగుల కోసం అమరణ నిరాహార దీక్ష చేస్తానని వారికి న్యాయం జరిగే వరకు పోరాడతానని అన్నారు.కెసిఆర్ మౌనంగా ఉన్నారు.కెటిఆర్ ట్వీట్ చేయడం లేదు.ఇతర నాయకులకు మాట్లాడే స్వచ్ఛ లేదని.మరి నిరుద్యోగుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. జనార్ధన్ రెడ్డి హయాంలో జరిగిన పరీక్షలన్ని రద్దు చేసి,తిరిగి నిర్వహించాలని టిఎస్‌పిఎస్ తెలంగాణ ప్రజల విశ్వసనీయత కోల్పోయిందని గ్రూప్ -1 ప్రిలిమ్స్‌లో వంద మార్కులు దాటిన అభ్యర్థుల వివరాలు బహిర్గత పరచాలన్నారు.సెక్రటరీ పిఏకు ఎలా కాన్ఫిడెన్షియల్ రూం యాక్సెస్ లభించిందని టెక్నికల్ సమస్యగా చూపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.సిట్‌కి అప్పగించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని కాబట్టి చైర్మన్ జనార్ధన్ రెడ్డిని,టిఎస్‌పిఎస్‌సి కమిటీని తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 17న మండల సర్వసభ్య సమావేశం

మొయినాబాద్ మార్చి 15, ప్రభాతవార్త :
మార్చి 17,శుక్రవారం మండల అధ్యక్షులు ఎంపీపీ నక్షత్రం జేవంత్ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ నక్షత్రం జేవంత్ మాట్లాడుతూ...శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సర్వసభ్యసమావేశానికి ప్రతి ఒక్క గ్రామం నుండి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, మరియు మండలంలోని అన్ని డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అధికారులు హాజరుకానున్నారని తెలిపారు, ఈ సమావేశం ద్వార మండలంలోని ప్రతి గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయి, ప్రజా సమస్యల పై చర్చించాలని అన్నారు. గ్రామ అభివృద్ధి సమస్యల పై ప్రతి ఒక్కరికి మాట్లాడే సమయం ఉంటుందని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని అన్నారు. ఈ కార్యాక్రమానికి ప్రతి ఒక్క గ్రామం నుండి సర్పంచ్, ఎంపీటీసీలు వచ్చి వారి గ్రామాల సమస్యలను వివిరించడంతో వాటికి పరిష్కార మార్గం చూపుతామన్నారు. ప్రతి ఒక్కరు శుక్రవారం ఉదయం 11 గంటలకు రావాలని అన్నారు.

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

-మేడ్చల్ జిల్లాలో 133పరీక్షా కేంద్రాలు..సజావుగా జరుగుతున్న వైనం
-వికారాబాద్ జిల్లాలో మొదటి రోజు 391 మంది విద్యార్థుల గైర్హాజరు..
-జిల్లాలో నిమిషం నిబంధన నిక్కచ్చిగా అమలు చేసిన అధికారులు..



వికారాబాద్ పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రానికి పరీక్ష రాసేందుకు వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

### మేడ్చల్ జిల్లాలో

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మార్చి 15, ప్రభాతవార్త :** జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమైనాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో బుధవారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు సజావుగా జరిగాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు జనరల్‌లో 64,301మంది ఉండగ వీరిలో 62,892మంది పరీక్షలకు హాజరైనట్లు, ఒకేషనల్‌లో 1,452మంది ఉండగ వీరిలో పరీక్షలకు 1,356మంది హాజరైనట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 1409మంది, ఒకేషనల్ వారు 96మంది పరీక్షలకు గైర్హాజరు అయినట్లు వివరించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 133పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని మండలాల వారీగ ఇంటర్ పరీక్షలకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అల్వాల్ మండలం పరిధిలో 7 పరీక్షా కేంద్రాలు 3,075మంది విద్యార్థులు ఉండగ వీరిలో 2960మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 115మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. బాచుపల్లి మండలంలో 19పరీక్షా కేంద్రాలు ఉండగ 10,966మంది ఉండగ, వీరిలో 10,798మంది పరీక్షలకు హాజరైనట్లు, 168మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఆయన వివరించారు. బాలానగర్ మండలంలో 2పరీక్షా కేంద్రాలలో 864మంది విద్యార్థులు ఉండగ 850మంది విద్యార్థులు హాజరైనట్లు, 14మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. దుండిగల్ మండలంలో 5పరీక్షా కేంద్రాలు ఉండగ వీటిలో 2,264మంది విద్యార్థులు ఉండగ వీరిలో 2,232మంది విద్యార్థులు హాజరైనట్లు, 32మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలో 7పరీక్షా కేంద్రాలు ఉండగ 3,246మంది విద్యార్థులకు 3,135మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు, 111మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. కాప్రా మండలంలో 15పరీక్షా కేంద్రాలు ఉండి 6,546మంది ఉండగ వీరిలో పరీక్షలకు 6,340మంది హాజరైనట్లు, 206మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. కీసర మండలంలో 2పరీక్షా కేంద్రాలు ఉండగ 795మంది విద్యార్థులకు 753మంది హాజరైనట్లు, 42మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. కూకట్‌పల్లి మండలంలో 31పరీక్షా కేంద్రాలు ఉండగ 17,794మంది విద్యార్థులకు 17,523మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయినట్లు, 271మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి మండలంలో 2పరీక్షా కేంద్రాలు ఉండగ 743మందికి 723మంది పరీక్షలకు హాజరు కాగా 20మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. మేడ్చల్ మండలంలో 5పరీక్షా కేంద్రాలు ఉండగ వీటిలో 1,901మందికి 1,827 మంది పరీక్షలకు హాజరైనట్లు, 74మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. మేడిపల్లి మండలంలో 13పరీక్షా కేంద్రాలు ఉండి 6,378మంది ఉండగ వీరిలో 6,247మంది పరీక్షలకు హాజరైనట్లు, 131మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ మండలంలో 14పరీక్షా కేంద్రాలు ఉండి 6, 441మందికి 6,243మంది పరీక్షలకు హాజరు అయినట్లు, 198 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. శామీర్‌పేట మండలంలో 3పరీక్షా కేంద్రాలు ఉండి1,211మందికి 1,148మంది పరీక్షలకు విద్యార్థులు హాజరైనట్లు, 63మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఉప్పల్ మండలంలో 8పరీక్షా కేంద్రాలు ఉండగ 3,529 మందికి 3,469మంది విద్యార్థులు పరీక్షలు హాజరైనట్లు, 60మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగ మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 133పరీక్షా కేంద్రాల్లో మొత్తం 65,753 మంది పరీక్షలకు రావాల్సి ఉండగ వీరిలో 64,248మంది హాజరైనట్లు, 1,505మంది పరీక్షలకు గైర్హాజరు అయినట్లు జిల్లా ఇంటర్ పరీక్షల కన్వీనర్, జిల్లా ఇంటర్ అధికారి పేర్కొన్నారు.

### వికారాబాద్ జిల్లాలో

**వికారాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు విద్యార్థులు సకాలంలో హాజరై పరీక్ష రాయడం జరిగింది. సంబంధిత అధికారులు నిమిషం నిబంధన నిక్కచ్చిగా అమలు చేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉండటంతో విద్యార్థులు సైతం పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 9,491 మంది ఉండగా, వారిలో 9,100 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 391 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ను పోలీసు అధికారులు అమలు పర్చారు.

### పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కావడంతో జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లో త్రాగునీరు ఇతర సదుపాయాలపై అదకారుల ం అడిగి తెలుసుకున్నారు. హాల్ టికెట్లు పొందడానికి ఏమైనా ఇబ్బందులు జరిగాయా, రవాణా సౌకర్యం ఎలా ఉందని కలెక్టర్ విద్యార్థుల ం అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పై కలెక్టర్ ఆరా తీశారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్, సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రమణమ్మ ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# అన్ని వర్గాల ప్రజలకు సేవలందించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

-మంత్రి శ్రీనివాస్‌గౌడ్

శంకర్‌పల్లి, మార్చి 15, ప్రభాతవార్త :
శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శాసనమండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆకాలంలో అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించారన్నారు. గౌడ కులస్థులనే గాక ఇతర కులాల వారికి కూడా ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ కూడా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారిని ఆదుకుంటున్నారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఉంటే వాటిలో ఈత, తాటి మొక్కలను నాటి గౌడ కులస్తులు పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసి వాటిలో ఈత, తాటి, ఖర్జూర మొక్కలను పెంచుతున్నదన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నాలుగు కోట్ల 17లక్షల మొక్కలను నాటి వాటి సంరక్షిస్తున్నారని తెలిపారు. త్వరలోనే ట్యాంక్ బండ్‌పై నీరా సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. రైతుబంధుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గౌడ కులస్థులకు కూడా ప్రభుత్వం పెన్షన్లు అందిస్తున్నదన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాలు మన పథకాలను కొనసాగిస్తున్నాయన్నారు. బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్రంలో రైతులకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్‌ను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని గుర్తు చేశారు. సీఎం ఎవరికి భయపడరని కేవలం మన రాష్ట్ర ప్రజలకు మాత్రమే భయపడతారని తెలిపారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మనసున్న మనిషిని అందరికి సహాయం చేసే గుణం ఆయనలో ఉందని కొనియాడారు. ఇలాంటి ఎమ్మెల్యే ఉండడం చేవెళ్ల నియోజకవర్గం ప్రజలకు అదృష్టం అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఏ.అనితసురేందర్‌గౌడ్, ఎంపీటీసీ సి.వెంకట్‌రెడ్డి, శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ మారేపల్లి పాపారావు, సొసైటి చైర్మెన్ బద్దం శశిదర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.గోపాల్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు ప్రశాంత్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, మీర్జాగూడ సర్పంచ్ గౌండ్ల రవీందర్‌గౌడ్, శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ గండేటి శ్రీనాథ్‌గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మండల గీతా పారిశ్రామిక సంఘం అధ్యక్షులు ఎస్.సత్యనారాయణగౌడ్, మున్సిపల్ అధ్యక్షులు గండేటి రాజేష్‌గౌడ్, నాయకులు సురేందర్‌గౌడ్, పార్శి బాలకృష్ణ, మండల బీసీ సమితి అధ్యక్షులు హరికృష్ణగౌడ్, కిరణ్‌గౌడ్, బుగ్గ వెంకటేష్‌గౌడ్, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల గౌడ కులస్తులు, గ్రామస్థులు ఉన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ఊరు వాడ సల్లంగా చూడు మైసమ్మ తల్లి

-మారెపల్లిలో అంగరంగ వైభవంగా జాతర ఉత్సవాలు



బోనాలతో ఊరెగింపుగా వెళుతున్న మహిళలు

**పెద్దేముల్, మార్చి 15, ప్రభాతవార్త:** ఊరు వాడ సల్లంగా చూడు మైసమ్మ తల్లి అంటు గ్రామస్థులు మొక్కులు మొక్కుకున్నారు. పెద్దేముల్ మండలంలోని మారెపల్లిలో బుదవారం ఆరె మైసమ్మ జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయానికి రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఊరెగింపుగా వెళ్ళి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. ఊరు వాడ సల్లంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆరె మైసమ్మ జాతర సందర్భంగా డప్పు డోలు వాయిద్యాల చప్పుళ్ళకు శివసత్తుల పూనకాలు, పోతురాజు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా బంధువుల రాకతో ఇళ్ళన్ని కళకళలాడుతూ మారెపల్లిలో పండుగ వాతవరణం నెలకొంది.

# ఆల్ ది బెస్ట్ ముఖేష్ : మంత్రి కెటిఆర్

- ముఖేష్‌కు పలువురి అభినందనలు

**బషీరాబాద్,మార్చి15,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామానికి చెందిన జోగి బుడ్డప్ప,జోగి ఉమా దంపతుల కుమారుడు జోగి ముఖేష్.ఈనెల 30వ తేదిన అమెరికాలో జరిగే అమెరికాన్ గాట్ టాలెంట్‌కు ఎంపిక అవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ విషయం తెలుసుకున్న తాండూర్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి బుధవారం నాడు మంత్రి కేటిఆర్ తో పరిచయం చేశారు.విషయం తెలుసుకున్న మంత్రి.ముఖేష్ కు అభినందనలు తెలిపారు. అమెరికాలో జరిగే కాంపిటిషన్‌లో విజేతగా నిలిచి దేశ ప్రతిష్టను,రాష్ట్రానికి,సొంత గ్రామానికి మంచి పేరు తెవాలని తెలిపినట్లు స్టంట్ మాస్టర్ ముఖేష్ తెలిపారు.



ముఖేష్‌ను మంత్రి కెటిఆర్‌కు పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

# సమన్యాయ పాలనకు అనేక సవాళ్లు..?

-రిటైర్డ్ ప్రొఫెసర్ బి.బి.పాండే

**శామీర్‌పేట, మార్చి 15, ప్రభాతవార్త :** సమన్యాయ పాలనను అమలు చేయటంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి సాగితేనే సమన్యాయ పాలన, రాజ్యాంగ బద్ద పాలన సాధ్యమవుతుందని ప్రముఖ న్యాయ విద్యావేత్త,ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బి.బి.పాండే అన్నారు. బుధవారం శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది, దివంగత గుత్తా రామారావు స్మారక ఉపన్యాస కార్యక్రమం జరిగింది. అయితే గుత్తా రామారావు స్మృతిలో వారి కుటుంబ సభ్యులు రూపొందించిన గుత్తా రామారావు విద్య,దాతృత్వ సంస్థ, వారి తరపున నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 14వ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించటం జరిగింది. దీనికి ప్రముఖ న్యాయ విద్యావేత్త ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బి.బి.పాండే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగ జరిగిన సమావేశంలో న్యాయ విద్యావేత్త బి.బి.పాండే మాట్లాడుతూ సమ న్యాయపాలన అనే భావనలో మూడు ప్రధాన అంశాలు ఉంటాయని, ప్రభుత్వ నిర్వాహణలో రాజ్య నిర్వాహణలో చట్టమే సర్వోన్నతం అని, చట్టం ముందు అందరు సమానులని, ప్రతి వ్యక్తికి సమానమైన చట్టపర హక్కులు ఉంటాయన్నారు. ఈ మూడు భావాలు ఆధునిక రాజ్య వ్యవస్థకు మూలం అని అన్నారు. సమయం సందర్భం పురస్కరించుకుని చట్టానికి మార్పు చేసుకునే వీలు ఉండటం ఉత్తమ సామాజిక విలువలను కాపాడే దానికి అనుగుణంగ విలువలు ఉండటం వల్ల సమన్యాయ పాలన భావనకు గౌరవం ఆమోదనీయతగ ఉంటుందని ఆయన అన్నారు. రాజ్యాంగమే ప్రధానం దానికి అనుగుణంగానే పాలన సాగాలని నూతన భావనకు పునాది సమన్యాయ పాలన అనే భావన ఉండేదని ఆయన గుర్తు చేశారు. 16శతాబ్ది తరువాత నుంచి ఎదిగి వచ్చిన ఈ సమన్యాయ పాలన అనే భావనకు అనేక సవాళ్లు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఆర్థికంగ ఉన్న వారు చట్టాన్ని లెక్క చేయని స్థితి ఉండటం, చట్టం ఆర్థికతకు లొంగిపోవటం, విచారణ చేయకుండానే శిక్షలు వేయటం, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతను ఇవ్వటం ద్వారా సామాన్యుల హక్కులకు విలువ ఇవ్వని స్థితి ఇవన్నీ కూడ సమన్యాయ పాలనకు సవాళ్లుగా ఉన్నాయని బిబి పాండే అన్నారు. ఈ సవాళ్లను ఎదురుకుంటూ సమన్యాయ పాలన పునాదిగా ఉండే ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నల్సార్ లా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.కృష్ణదేవరావు అధ్యక్షత వహించి స్వాగతోపన్యాసం చేశారు. దీనిలో స్మారక సంస్థ తరపున జిబికె చౌదరి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.విద్యులతారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట నల్సార్ లా యూనివర్సిటీలో గుత్తా రామారావు స్మారక ఉపన్యాస కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ న్యాయ విద్యావేత్త,ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బి.బి.పాండే,పాల్గొన్న నల్సార్ వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్ తదితరులు

## కాన్షీరాంకు బిఎస్‌పీ నాయకుల నివాళులు



ఘట్‌కేసర్‌లో కాన్షీరాంకు నివాళులు అర్పిస్తున్న బిఎస్‌పీ నాయకులు

**ఘట్‌కేసర్, మార్చి 15, ప్రభాతవార్త:**
బహుజనుల అభ్యున్నతికి కాన్షీరాం అందించిన సేవలు చిరస్మరణీయమని బిఎస్‌పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చీరాల జంగయ్య అన్నారు. ఘట్‌కేసర్ లో బుధవారం కాన్షీరాం 89వ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ఆవరణలో బహుజన సమాజ్‌పార్టీ ఘట్‌కేసర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన అందించిన సేవలను నాయకులు కొనియాడుతూ ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బిఎస్‌పీ ఇంచార్జ్ సుక్కా దానంద్, మండల అధ్యక్షులు గ్యార గోవర్దన్, వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## కంటివెలుగుతో దృష్టిలోపాలు దూరం: చైర్‌పర్సన్



ఘట్‌కేసర్ అంథోనీస్ పాఠశాలలో కంటివెలుగు శిభిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని యాదవ్, కౌన్సిలర్ జహంగీర్

**ఘట్‌కేసర్, మార్చి 15, ప్రభాతవార్త:**
కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 13వ వార్డులోని అంథోనీస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ షేక్ జహంగీర్‌తో కలిసి ఆమె కంటి వెలుగు నేత్ర శిభిరాన్ని సందర్శించి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు నేత్ర పరీక్షలు చేయించుకొని అవసరమైన కళ్ల జోళ్లు పొందాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో నేత్ర వైదు్యరాలు శ్రేయ, పిహెచ్ఎన్ విమలరెడ్డి, అప్తమాలజిస్ట్, శిరీష, ఎఎన్ఎంలు విజయ, రాజేశ్వరీ, ఆశావర్కర్లు ధనలక్ష్మి, సిహెచ్.మేఘమాల, సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని జంతువు దాడిలో లేగ దూడ మృతి

**తలకొండపల్లి మార్చి15,ప్రభాతవార్త :**
గుర్తు తెలియని జంతువు దాడిలో లేగ దూడ చనిపోయింది.ఈ ఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని కోరింతకుంట గ్రామపంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది.గ్రామానికి అర కిలోమీటరు దూరంలో భీమా నాయక్ అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో రాత్రి గుర్తు తెలియని జంతువు దాడి చేసి లేగ దూడను చంపింది.గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం…బీమా నాయక్‌కు చెందిన సుమారు 5పశువులు ఉండగా రోజువారీగా ఆ పశువులను తన వ్యవసాయ క్షేత్రంలోనే కట్టేసి రాత్రివేళ ఇంటికి వస్తుంటారు.బుధవారం ఉదయం పొలం దగ్గరికి వెళ్లి చూడగా గుర్తు తెలియని జంతువు దాడి చేసి లేగ దూడను చంపేసిందని బాధితుడు ఆవేదనతో తెలిపాడు.లేగ దూడను చంపిన చోట జంతువు పాదముద్రలు కనిపిస్తున్నాయి.లేగ దూడను చంపిన జంతువు చిరుత పులా లేక హైనానా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే తలకొండపల్లి మండలంలోని పలు గ్రామాలలో కుక్కలు విజృంబించి మేకలను గొర్రెలను చంపి వేసిన సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.అయినా ఈ ఘటనపై ఇప్పటివరకు అధికారులు ప్రజాప్రతినిధులు,ఏమాత్రం చొరవ చూపి పేద ప్రజలకు న్యాయం చేయాలని ఆలోచన లేకపోవడంతో తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత 5 నెలల క్రితం ఇదే తండా సమీపంలో గల కేస్‌లి తండాకు చెందిన గుండె నాయక్ వ్యక్తికి చెందిన 5-6 మేకలను ఇదే రీతిన రాత్రి సమయంలో చంపేసింది.అప్పటినుండి అటవీశాఖ అధికారులు ఎదరు సంఘటనపై చర్యలు తీసుకోకపోవడం పట్ల మరింత భయాందోళన గురవుతున్నట్లు తండావాసులు తెలుపుతున్నారు.ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతిని కోరింత తండా సమీపంలో తిరుతున్న జంతువును గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, మార్చి 15, ప్రభాతవార్త:** విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా గురువారం కరెంట్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఏఇ సతీష్ తెలిపారు. అంకుశాపూర్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని అంకుశాపూర్ 11 కేవీ అగ్రికల్చర్, 11 కేవీ మాదారం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నాట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంకుశాపూర్ గ్రామం, వ్యవసాయం పంపుసెట్లకు, మాదారం గ్రామం, వ్యవసాయ పంపుసెట్లకు నాలుగు గంటల పాటు కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఇ సతీష్ కోరారు.

## దేశానికే ఆదర్శం 'కంటి వెలుగు'

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ**

**చిన్నకోడూరు, మార్చి 15, ప్రభాతవార్త :** కంటి వెలుగు పథకం దేశానికే అదర్శంగా నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపిపి కూర మాణిక్యరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అవసరం ఉంటే వెంటనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, వనితరవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ 'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి

**దుబ్బాక, మార్చి15, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలో తాళ్లపల్లి గ్రామంలో రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ గోపరి ప్రియాంకయాదగిరి, ఎంపీటీసీ మంద చంద్రసాగర్, ఎంపీడీవో భాస్కర్‌శర్మ, వైద్యాధికారిని డాక్టర్ సాయి తేజస్విని కలిసి బుధవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారు శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యాక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం వైద్యాధికారిని డాక్టర్ సింధూజ,అంగన్వాడి సూపర్వైజర్ రాజేశ్వరి, ఎంపీఓ నరేందర్ రెడ్డి,ఐకెపి సి. పరశురాములు, అంగన్వాడి టీచర్ పాతూరి వెంకటలక్ష్మి,వైద్యా సిబ్బంది, పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సిఎం కెసిఆర్ లక్ష్యం

**-ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**గజ్వేల్, మార్చి 15 (ప్రభాతవార్త):** రైతు సంక్షేమంకోసమే సిఎం కెసిఆర్ పనిచేస్తున్నారని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన సాధారణ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల పాలనలో సిఎం కెసిఆర్ దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కాలువలు, వాగుల్లో కాళేశ్వరం నీళ్లుపారుతున్నాయని, సిఎం కెసిఆర్ సాహసోపేత నిర్ణయంతోనే రైతులకు నీళ్లు వచ్చాయన్నారు.రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకొని ఎన్‌పిఏగా ఖాతాదారులకు యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో 50 శాతం నుండి 80 శాతం వరకు బకాయిలలో మాఫీ ప్రకటించడం జరిగిందని, రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈనెల 31 తేదీలోపు తమ బకాయిలు చెల్లించి అప్పు మాఫీ పొందాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, ఫ్యాక్స్ చైర్మన్ జేజల వెంకటేషంగౌడ్, పాల్గొన్నారు.

# సిఎం కెసిఆర్‌కు మహిళలు అండగా నిలవాలి

**డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డి**



మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

**కొండపాక, మార్చి 15, ప్రభాతవార్త :**
రాష్ట్ర రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపాక రైతు వేదికలో ఐకెపి మండల సమైఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ఎంపిపి ర్యాగల్ల సుగుణ, ఎంపిపి ఉపాధ్యక్షులు దేవి రవీందర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ముగ్రపాలను పిల్లలు పుట్టిన వెంటనే తాగించాలని కోరారు. మహిళల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని చెప్పారు. బిజెపి ప్రభుత్వం ఆదాని, అంబానిల కోసమే గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచుతూ సామాన్యుల జీవనాన్ని దుర్భరంచేస్తుందన్నారు. ఎంపిపి సుగుణ,ఎంపిపి ఉపాధ్యక్షుడు దేవిరవీందర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యలక్ష్మి పథకం కింద 8 రకాల వైద్య పరీక్షలు చేయించుకొవాలని కోరారు. మహిళలపట్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్దతో పనిచేస్తుందని ప్రతిమంగళవారం ఆరోగ్యలక్ష్మి కింద పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. గృహలక్ష్మి పేరుతో ఇండ్లులేని వారు నిర్మించుకుంటే రూ॥3 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించరన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వనికి, సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలుద్దామని పిలుపు నిచ్చారు. ఉమ్మడి మండలంలోని 25 గ్రామ పంచాయతీలల్లో ఉన్న 1009 మహిళ గ్రూపులకు రూ॥ 16,088680 చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టి మాధురి, ఎంపిడిఒ రాంరెడ్డి, మండల రైతు బందు సమితి కన్వీనర్ ర్యాగల్ల దుర్గయ్య, ఎంపిటిసిల మండల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా, మండల సమైఖ్య అధ్యక్షురాలు మమత, ఎపిఎం శ్రీనివాస్, సర్పంచులు ముస్త్యాల కనకయ్య, సంజీవరెడ్డి, విఎఒలు, సిసిలు, మహిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ పట్టణంలో ఇంటర్‌మీడియట్ పరీక్ష కేంద్రం దృశ్యం

## ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

**-ఒక్క నిమిషం నిబంధనతో పరీక్షకు దూరమైన విద్యార్థులు**

**- బస్సుల కొరతతో పరీక్షలకు దూరమయ్యామని గగ్గోలు**

**హుస్నాబాద్, మార్చి 15,ప్రభాతవార్త :** హుస్నాబాద్ డివిజన్‌లో ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. ఒక నిమిషం ఆలస్యమైతే అనుమతించమని నిర్దేశించిన నిబంధనల కారణంగా మూడు పరీక్షా కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులను అనుమతించలేదు. దీంతో పరీక్షకు దూరమై విద్యార్థులు గగ్గోలు పెట్టారు. గ్రామాల నుండి బస్‌సౌకర్యం లేని కారణంగా పరీక్షకు సరైన సమయానికి చేరుకోలేకపోయామని, బతిమిలాడినా ఫలితం లేకపోయింది. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలను నెలకొల్పారు. హుస్నాబాద్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల కళాశాలతోపాటు మోడల్‌స్కూల్‌లను ఏర్పాటుచేశారు. అక్కన్నపేట మండలం మంచనీళ్ల బండ, రామవరంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గ్రామాల నుండి బస్సులు లేక విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా చేరుకున్నారు.బాలుర,బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో 302,237మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 65మంది గైర్హాజరయ్యారు.ఇక మోడల్ కళాశాల కేంద్రంలో 242కుగాను 99మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.హుస్నాబాద్ ప్రాంతంలో పరీక్షలు ప్రశాంతగా సాగాయి.

## తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

**చిన్నకోడూరు, మార్చి 15, ప్రభాతవార్త :** బిజెపి కిసాన్ మార్చా ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విజయలక్ష్మీకి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పిట్ల పర్శరాములు మాట్లాడుతూ రైతు రుణమాఫీ లక్ష వడ్డీతో సహా చెల్లించి వెంటనే రైతులకు కొత్త రుణాలను అందించాలన్నారు. 24 గంటలు విద్యుత్‌ను సరఫరా చేసి రైతులు వేసిన వరి పంటలు ఎండిపోకుండా చూడాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ పథకం ద్వారా ప్రధాని మోడీ రైతులకు ఉచితంగా అందిస్తున్న కందులు,పెసర్లు, నూనె గింజలు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర అందించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి, కిసాన్ మోర్చా నాయకులు అక్కి సంతోష్‌కుమార్, బస్వరాజ్ మహేష్, రంగాచారి, భూమేష్‌గౌడ్, రాజిరెడ్డి, నిమ్మల శ్రీనివాస్, రమేష్, రవీందర్, సాయికిరణ్, సంతోష్, శేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బిజెపి కిసాన్ మోర్చా నాయకులు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శివరంజని

## కొనుగోలు చేసే ప్రతీ వస్తువుకు రసీదు తీసుకోవాలి

**జూనియర్ సివిల్ జడ్జ్ శివరంజని**

**హుస్నాబాద్, మార్చి 15,ప్రభాతవార్త :** వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతీ వస్తువుకు రసీదును తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జ్ శివరంజిని అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో అంతర్జాతీయ వినియోగదారు దినోత్సవం సందర్బంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సంఘాలకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ వినియోగదారులు తీసుకునే 20లక్షల లోపు వస్తువుల నాణ్యత విషయంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి తగిన పరిహారం పొందవచ్చన్నారు.వస్తువుల రేటును బట్టి కోర్టు ఫీజులు ఉంటాయన్నారు.కుటుంబ తగాదాలతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని కాలం వృదా చేసుకోకుండా కుటుంబంలో,పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు.ఎలాంటి విషయంలో నైనా సరైన ఆధారాలు,హక్కులు లేకుండా ఫిర్యాదులు తమ వద్దకు వస్తే ఎలాంటి న్యాయం చేయలేమన్నారు.అనంతరం గ్రామైఖ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేపర్ ప్లేట్ల తయారీ, జూట్ బ్యాగుల తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్, న్యాయవాదులు సాయిని మల్లేశం,శ్రీదేవి,మురళి పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**హుస్నాబాద్, మార్చి 15,ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తోట మహేష్ అన్నారు.బుధవారం మండలంలోని పోతారం (ఎస్)లో గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చదువుకోని వారి కంటే చదువుకున్న యువకులే ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు.ప్రస్తుతం జరుగుతున్న దొంగతనాల గురించి వివరించారు.బ్యాంకుల వారు ఎప్పుడు కూడా ఫోన్ చేసి ఓటిపి అడగరని,ఒక వేల అలాంటి పోన్లు వస్తే వారికి అకౌంట్‌లకు సంబందించిన వివరాలు,ఓటిపిలు చెప్పవద్దన్నారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 24 గంటల లోపు 1930కి లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోయిన సొమ్మును రికవరీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు.అంతే కాకుండా ప్రజలకు సమస్యలు ఉన్నా, మహిళలు ఎలాంటి ఇబ్బందులకు గురైనా వెంటనే 100కు సమాచారం అందించి సహాయాన్ని పొందాలన్నారు.మహిళల కోసం ప్రత్యేకంగా షీటీమ్స్ 24 గంటలు పనిచేస్తున్నాయని గుర్తు చేశారు.

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ : ఎంపిపి

**హుస్నాబాద్, మార్చి 15,ప్రభాతవార్త :** పేదలకు వరం సీఎం రిలీఫ్‌ఫండ్ అని ఎంపిపి లకావత్ మానససుభాష్,జడ్పి వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మడద గ్రామానికి చెందిన ఎన్ పార్వతి, పొట్లపల్లి గ్రామానికి చెందిన ఎన్.శ్రీకాంత్, టి తిరుపతి, ఒదయ్య, కూచనపల్లి గ్రామానికి చెందిన కె.కనుకవ్వ, పోతారం గ్రామానికి చెందిన జి.మాధవి, మహ్మదాపూర్ గ్రామానికి చెందిన పిట్టల వెంకటలక్ష్మిలు గతంలో అనారోగ్యానికి గురై ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది అయిన ఖర్చులను స్థానిక ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వంగ విజయలక్ష్మివెంకటరామిరెడ్డి, బత్తిని సాయిలు,గీకురు రాజేశ్వరి,మాజీ మార్కెట్ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వాడీవేడిగా మండల సర్వ సభ్య సమావేశం

**సమస్యలకు పరిష్కారం చూపని సభలు, సమావేశాలు ఎందుకు ?**

**అధికారుల తీరుపై మండిపడిన ప్రజాప్రతినిధులు...**



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

**అక్కన్నపేట, మార్చి 15, ప్రభాతవార్త**
సమస్యలకు పరిష్కారం చూపని సభలు సమావేశాలు ఎందుకు అని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. బుధవారం అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపిపి మాలోతు లక్ష్మి భీలునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశం వాడివేడిగా సాగింది. ఉదయం 10గంటలకు ప్రారంభమైన సమావేశానికి ప్రజాప్రతినిధులు ఆలస్యంగా వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంమై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్‌వాడీసెంటర్‌లలో తల్లిబిడ్డలకు, గర్భవతులకు పౌష్టికాహారం అందించడం లేదని సిడిపివో జయశ్రీని అడిగితే పొంతన లేని సమాదానాలు చెబుతోందని మండిపడ్డారు.గ్రామ పంచాయతీలలో అప్పులు చేసి చేపట్టిన అభివృద్ది పనుల బిల్లుల కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా సాంకేతిక సమస్యల పేరుతో కాలయాపన చేస్తూ తమను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొంత మంది సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. 9 నెలలుగా నిధులు లేక గ్రామ పంచాయతీ సిబ్బందికి సైతం జీతాలు ఇవ్వకపోవడంతో నిత్యం వారు ఇండ్ల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు.మరో పది రోజుల్లో నిధులు మంజూరు చేయకుంటే గ్రామ పంచాయ తీకి తాళం వేస్తామని మరో సర్పంచ్ స్పష్టం చేశారు.ఒకవేపు తాము సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంటే సమస్యల పరిష్కారం కోసం నిర్వహించేసమావేశంలో అయినా సమస్యలు పరిష్కారం కాకుంటే సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. నిర్వహించిన సమావేశానికి సంబందిత అధికారులు రాకుంటే సమస్యలను ఎవరికి చెప్పమంటారని మండిపడ్డారు.

# తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ**



జడ్పీ స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రోజాశర్మ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం 5వ, 6వ 7వ,1వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమం, సాంఘీక సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక, పనులపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో రైతులకు విద్యుత్‌సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. బీటీ రోడ్డు రెన్యువల్స్ పనులన్నీ వర్షాకాలంలోపు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నీ వచ్చే విద్యా సంవత్సరంలోపు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించే పోషకాహారం సక్రమంగా లబ్దిదారులకు అందేలా చూడాలన్నారు. వసతి గృహాల్లో చదివే పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. సమావేశాలలో జిల్లా పరిషత్ సభ్యులు, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోహెడలో చలివేంద్రం ప్రారంభం

**కోహెడ, మార్చి 15, ప్రభాతవార్త :** వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. బిజెపి నియోజకవర్గ నాయకులు జెఎస్ఆర్ ఫౌండేషన్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా కొత్త బస్టాండువద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జెఎస్ఆర్ ఆధ్వర్యంలో రూ.1 లక్ష వ్యయంతో కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్ యాదవ్, శివకుమార్‌గౌడ్, రజినీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్,రమేష్, తిరుపతి, సత్యనారాయణరెడ్డి, రాజేందర్‌గౌడ్, పవన్‌రెడ్డి, సతీష్, సాగర్‌గౌడ్, శ్రీకాంత్, వెంకటస్వామి, రాజమౌళి,గ్రామస్తులు చాంద్‌పాషా, రవీందర్, లక్ష్మయ్య, లింగయ్య, షేక్ హిమామ్, రాజయ్య, అటో కార్మికులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**మిరుదొడ్డి, మార్చి 15, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సిద్ది భారతి భూపతి గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మల్లుపల్లిలో బుధవారం సర్పంచ్ అధ్వర్యంలో లక్ష్మక్కపల్లి అర్‌విఎం అసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. శిబిరం ఏర్పాటు చేసిన అర్‌విఎం అసుపత్రి సిబ్బందికి అమె కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో 200 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## పేద వధువుకు రూ. 30 వేల సహాయం

**గజ్వేల్, మార్చి 15 (ప్రభాతవార్త):** పేద అమ్మాయి వివాహానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.30 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన పేద ముదిరాజ్ కుటుంబానికి చెందిన అనాథ అమ్మాయి పెళ్లికి రూ.30వేల నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పిట్ల ఆంజనేయులు, కొట్టాల శ్రీనివాస్, నాచారం డైరెక్టర్ చింత శ్రీనివాస్, మర్కంటి కనకయ్య, విజయ్, శ్రీను, కిషోర్, జంగం శ్రీను, చిక్కుడు భగవాన్, ప్రసాద్, రంగయ్య, గొడుగు స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన చక్రధర్‌గౌడ్



బిజెపిలో చేరుతున్న చక్రధర్‌గౌడ్

**సిద్దిపేట రూరల్, మార్చి 15, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణానికి చెందిన ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ సతీసమేతంగా బుధవారం ఢిల్లీలో బిజెపిలో చేరారు. ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి తరుణ్‌చుగ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, బిజెపి చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్, సునీల్ భన్సల్ అధ్వర్యంలో చక్రధర్‌గౌడ్ పార్టీలో చేరారు. దీంతో అయనకు పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## అందరికీ కంటి వైద్యం అందేలా చూడాలి

**జిల్లా వైద్య అరోగ్యశాఖ అధికారి కాశీనాథ్**

**నంగునూర్, మార్చి 15, ప్రభాతవార్త :** అందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన కంటి వెలుగుపై అవగాహన పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ వైద్య సిబ్బందిని అదేశించారు. బుధవారం మండల పరిధిలోని పాలమాకుల రైతు వేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కంటివెలుగు టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో క్యాంపు ఇంచార్జి డాక్టర్ శివకేశవరెడ్డి, పిహెచ్ఎన్ హేమలత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఐకెపి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అండర్ 14 క్రికెట్ మ్యాచ్‌లో సత్తా చాటిన ధనుష్

**సిద్దిపేట రూరల్, మార్చి 15, ప్రభాతవార్త :** హకీంపేట రావుఎస్‌టిడి మార్ట్ క్రికెట్ గ్రౌండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదారాబాద్ అండర్-14 మ్యాచ్‌లో భాగంగా సిద్దిపేటకు చెందిన గాడిచర్ల ధనుష్ తన సత్తా చాటారు. 50 ఓవర్ల మ్యాచ్‌లో 90 బంతుల్లో సెంచరి సాధించి 17 ఫోర్లు కొట్టారు. క్రికెట్ మ్యాచ్‌లో సత్తా చాటిన ధనుష్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్, మధు, బాబు, మాజీద్, కిషోర్, మనిశంకర్, డాక్టర్ మహేష్‌లు అభినందించారు.

## ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి: సర్పంచ్

**హుస్నాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలో శ్రీమహాలింగేశ్వరస్వామి ఆలయ పునర్‌నిర్మాణం చేపట్టేందుకు దాతలు ముందుకు రావాలని సర్పంచ్ తోడేటి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆలయ పునర్ నిర్మాణానికి కరీంనగర్‌కు చెందిన గుడిగంటి సూర్యకళగుండయ్యశర్మ రూ.21 వేలు, గోదావరిఖనికి చెందిన ఉప్పరపల్లి సంపత్ రూ. 10,116, గోలి లక్ష్మిమల్లయ్యలు 10,116, శ్రీకొండ సుగుణ తిరుపతి రూ.5,116, చిర్ర శ్వేతప్రశాంత్ రూ.1116లు, పీసర గ్రామానికి చెందిన రాగి సంతోష్ ధర్మ హుండి అందించినట్లు తెలిపారు.ఈ సందర్భం గా విరాళాలు అందించిన దాతలకు సర్పంచ్ రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సురక్షితమైన పద్దతులపై అవగాహన పెంచనుంది

**శామిర్‌పేట మార్చి15,ప్రభాతవార్త :** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ మరియు అమేజాన్ ఇండియా సంయుక్త కార్యక్రమాలకు సహకారాన్ని అందించుకునేందుకు అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేసుకున్నాయి.ఈ ఒప్పందాల ద్వారా వినియోగదారులకు ఆన్‌లైన్‌లో ఎక్కువ నమ్మకంతో షాపింగ్ చేసేందుకు సాధికారత దక్కుతుంది.ఆన్‌లైన్ వినియోగదారులు తమ హక్కుల పట్ల అవగాహనను మెరుగుపరచడంలో పాటు సురక్షితమైన షాపింగ్ పద్దతులపై అవగాహన పెంచేందుకు వంచుకుల నుంచి ఆన్‌లైన్ పాపర్లను రక్షించే దిశలో సహకారాన్ని అందించేందుకు అంగీకరించుకుని,ఈ రెండు సంస్థలు వెల్లడించాయి.

## పేదలకు కొండంత అండ సిఎం సహాయనిధి : ఎమ్మెల్సీ

**గజ్వేల్, మార్చి 15 (ప్రభాతవార్త):** పేదలకు సిఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సింగాటం స్నేహకు రూ.56వేలు, శ్యామలకు రూ.48 వేలు, పాములపర్తి పోచమ్మకు రూ.30వేలు, బయ్యారం నవీన్‌కు రూ.20 వేలు, గజ్వేల్ రాజేశ్వరికి రూ.12వేల సిఎంసహాయనిధి చెక్కులు మంజూరు కాగా వాటిని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పథకం ద్వారా ఎంతో మంది పేదలకు లబ్ది చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు పంగ మోహన్‌బాబు, సింగాయిపల్లి సర్పంచ్ వేణుగోపాల్‌రావు, నాయకులు జిన్నా, కృష్ణ, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు ఆనందకరమైన పరిష్కారం లభిస్తుంది

**శామీర్‌పేట మార్చి15,ప్రభాతవార్త :** ఈ వరల్డ్ స్లీప్ డే కోసం 15-19 మానిక, వరకు తమ సేల్‌తో అమేజాన్ ఉత్తేజభరితమైన డీల్స్ మరియు ఆఫర్స్‌ను అందిస్తోంది.కస్టమర్స్ మ్యాట్రెసెస్,దిండ్లు,బెడ్ షీట్స్ మరియు అన్నింటిపై 75శాతం వరకు డిస్కౌంట్‌ను పొందవచ్చని మరియు తమ ఇంటిని ఆనందకరమైన ప్రపంచంగా మార్చవచ్చని ఒక వేయ్యి డిల్స్ పొంది ఈ వరల్డ్ స్లీప్ డే నాడు నిద్రకు పరిష్కరం పొందదని వెల్లడించింది.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**జగదేవ్‌పూర్, మార్చి 15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన రాచకొండ నర్సింలు అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్, రజక సంఘం నాయకులతో కలిసి బుధవారం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం లాండ్రీ కన్వీనర్ రత్నాల కనకయ్య, మండల రజక సంఘం ఉపాధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్, జూపల్లి రాజశేఖర్, రాచకొండ ఆంజనేయులు, ఎడపల్లి వెంకటేష్, కోశాధికారి రాచకొండ బాల్‌నర్సయ్య, సంయుక్త కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు నవీన్, ధర్మారం గ్రామ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు సిఎంఆర్ఎఫ్ వరం



**తలకొండపల్లి మార్చి15,ప్రభాతవార్త :** పేదలకు సిఎంఆర్ఎఫ్ వరంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన బంగరుల్ల శ్రీనుకి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో మంజూరైన 14వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును శ్రీనుకు బీఆర్ఎస్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సుధాకర్ రెడ్డి,వెంకట్రావు పేట సర్పంచ్ హైమావతి రమేష్, మాజీ సర్పంచ్ రాములు,గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగయ్య,శేఖర్ యాదవ్,సంగం ప్రెసిడెంట్ యాదయ్య,కార్యదర్శి శరథ్,మాస్కు వెంకటయ్య,విజయ్,రవి,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన జడ్పీటిసి



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

**కడ్తాల్,మార్చి 15 ప్రభాతవార్త :** సొంతింటి కలను నెరవేర్చడమే ముఖ్య ఉద్దేశంతో జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టుద్వారా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు, కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్, కడ్తాల మండలం ముద్విన్ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ నెలలో ఇంటి పనులన్ని పూర్తిచేసి యాదమ్మతో గృహప్రవేశం చేయిస్తామని వారన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మన్ వెంకటేష్‌గుప్తా, రైతుసమన్వయ సమితి జిల్లా సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రైతు కో ఆర్డినేటర్ వీరయ్య, నరసింహ, సర్పంచ్ యాదయ్య, భారతమ్మ నరసింహగౌడ్, ఉపసర్పంచ్ వినోద్, వార్డు సభ్యులు సౌజన్య రాజునాయక్, నాయకులు నరసింహ, శ్రీను, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కడ్తాల్, మార్చి 15 ప్రభాతవార్త :** కడ్తాల్ పట్టణానికి చెందిన పోతగళ్ల బాలయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న కడ్తా సర్పంచ్ గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి (ఎల్ఎన్ రెడ్డి) బాలయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, రైతు కో ఆర్డినేటర్ మంగలపల్లి నరసింహ, రామచంద్రయ్య, సిద్దిగారి వెంకటేష్, పెంటయ్య, యాదయ్య, జంగయ్య, చెన్నయ్య, శంకరయ్య, రమేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ పట్ల సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**తలకొండపల్లి మార్చి15,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని సంగాయిపల్లిలో గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...సంగాయిపల్లిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ,జిల్లా స్థాయి బహుజన మేధావులు,వక్తలు ,అనేక మంది రావడం జరుగుతుందని అంబేద్కర్ పూలే జ్ఞాన జాతర కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ అన్నారు.అంబేద్కర్ బొమ్మ పండుగ అనే పేరుతో 24 గంటల సభ నిర్వహించడం జరుగుతుందని 1000మందికి భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.సంగాయిపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుగుతుందని ఆయన అన్నారు.

## విజయవంతమైన వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, శిబిరానికి వచ్చిన వారికి చికిత్స నిర్వహిస్తున్న దృశ్యం

**కడ్తాల్,మార్చి 15 ప్రభాతవార్త :** కడ్తాల్ మండలంలోని చారికొండ గ్రామంలో బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. డా. ఉప్పల అఖిల్ సారథ్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి తలకొండపల్లి ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలంగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని వివరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న 365 మందికి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్యగౌడ్, నాయకులు భీష్మచారి, గడ్డం ఐలయ్య, అంజిరెడ్డి, నరసింహ తిరుపతి శేఖర్‌గౌడ్, మహేష్, ఉప్పల వెంకటేష్, అన్న మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి అంత్యక్రియలకు చేయూత

**తాండూరు, మార్చి 15, ప్రభాతవార్త :** వృద్ధురాలి అంత్యక్రియలకు తాండూరు బిజెపి నేతలు చేయూతనందించారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూరు 15వ వార్డుకు చెందిన వృద్ధురాలు మొగులమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు ఎల్లప్ప, జుంటుపల్లి వెంకట్ తదితరులు పార్టీ నేతలతో కలిసి బుధవారం కుటుంబసభ్యులను పరామర్శించారు. వృద్ధురాలు మొగులమ్మ అంత్యక్రియలకు రూ.3వేల ఆర్థిక సమాయాన్ని అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# అపరిచిత వ్యక్తులతో యువత అప్రమత్తంగా ఉండాలి

-సైబర్‌నేరాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలి
-ఆన్‌లైన్ వేధింపులకు ఎదురైతే వెంటనే 1903కి ఫోన్ చేయండి
-రాచకొండ కమిషనర్ డిఎస్ చౌహాన్



సైబర్ నేరాలకు సంబంధించి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాచకొండ కమిషనర్ డిఎస్ చౌహాన్ ఐపిఎస్,తదితరులు

**ఇబ్రహీంపట్నం, మార్చి 15, ప్రభాతవార్త:** అపరిచిత వ్యక్తులతో యువత అప్రమత్తంగా ఉండాలని కమీషనర్ డిఎస్ చౌహాన్ ఐపిఎస్ సూచించారు.మండల కేంద్రంలోని గురునానక్ ఇంజనీరింగ్ కలాశాలలో బుదవారం రాచకొండ సెక్యూరిటి కౌన్సిల్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపట్ల యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాచకొండ కమీషనర్ డిఎస్ చౌహాన్ ఐపిఎస్ పాల్గొని మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక యుగంలో యువత,విద్యార్థులు, ప్రజలు సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ వ్యక్తిగత వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని చెప్పారు.ఫోన్‌లో ఒటిపి,ఒఎల్ఎక్స్,పెటిఎం వంటి తదితర మెసేజ్‌లకు స్పందించవద్దని వివరించారు.ప్రజలు సైబర్ నేరాలకు గురైన తక్షణమే 1903కి టోల్‌ఫ్రి నెంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరి చేసే అవకాశం ఉందన్నారు.ప్రజలు వీలైనంత వరకు పబ్లిక్ వైఫైలు ఉపయోగించి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయకూడదన్నారు.అనంతరం సైబర్ నేరాలకు సంబందించి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో డిసిపి అనురాధ ఐపిఎస్ సైబర్ క్రైం,డిసిపి రోడ్ సేఫ్టి శ్రీబాల దేవి,డిసిపి మహేశ్వరం శ్రీనివాస్,ఎసిపి ఉమామహేశ్వర రావు,ఎసిపి వెంకటేశం,ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అనిల్ రాచమల్ల,గగన్‌దీప్ కోహ్లి,సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి టాపర్‌కి నగదు

-విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్‌లు అందజేత
-చేవెళ్ల ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డి సతీమణి సీతా వెల్లడి



చేవెళ్ల మోడల్ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ఫ్యాడ్‌లను అందజేస్తున్న చేవెళ్ల ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డి సతీమణి సీతా



చేవెళ్ల మోడల్ పాఠశాలలో చేవెళ్ల ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డి సతీమణి సీతని శాలువాతో సన్మానిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,చేవెళ్ల ఎంపిపి మల్గారి విజయలక్ష్మి, జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ, వైఎస్ ఎంపిపి శివప్రసాద్, చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ,మల్కాపూర్ సర్పంచ్ శివారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తదితరులు

**చేవెళ్ళ,మార్చి 15, ప్రభాతవార్త** పదవ తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు పది వేయిల రూపాయల నగదుతో సత్కరిస్తామని చేవెళ్ల ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డి సతీమణి సీతా వెల్లడించారు.బుదవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు చేవెళ్ల ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డి సహకారంతో ఉచితంగా పరీక్షల ఫ్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డి సతీమణి సీతా మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పదవ తరగతి పరీక్షలకుహజరౌతున్న విద్యార్థులకు ఉచితంగా ఫ్యాడ్‌లను అందజేస్తున్నామన్నారు.పార్లమెంట్ పరిధిలోని పాఠశాలల్లో పదవ తరగతిలో పరీక్షల్లో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు పది వేయిల నగదుతో ప్రతి ఒక్క విద్యార్థికి అందజేసి సత్కరిస్తామన్నారు. విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాను సాదించాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి,చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో పదవ తరగతి పరిక్షలకు హజరౌతున్న సుమారు ఐదు వేయిల మంది విద్యార్థులకు ఉచితంగా ఫ్యాడ్‌లను అందజేయనున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదును బహుమతితో సత్కరిస్తామన్నారు. ప్రతి విద్యార్థి టాపర్‌గా నిలిచేందుకు చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య,చేవెళ్ల ఎంపిపి మల్గారి విజయలక్ష్మి, జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ, వైఎస్ ఎంపిపి శివప్రసాద్, చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, మల్కాపూర్ ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, మల్కాపూర్ సర్పంచ్ శేరి శివారెడ్డి, అలూరు ఎంపిటిసి నరేందర్, యువజన నాయకుడు వనం లక్ష్మాకాంత్‌రెడ్డి,మండల పార్టీ అద్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ పాల్గోన్నారు.

## కొనసాగుతున్న నమో మాతృమూర్తి కార్యక్రమం



. గర్భిణీలు, బాలింతలకు ప్రోటీన్ బాక్సులను అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

**షాద్‌నగర్, మార్చి 15 , (ప్రభాతవార్త) :** పాలమూరు ట్రస్ ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణీలకు పంపిణీ చేస్తున్న ప్రోటీన్ బాక్సుల పంపిణీ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతూ 39వ రోజుకు చేరుకుంది. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నమో మాతృమూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాలమూరు ట్రస్ట్ ఛైర్మన్ పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం కేశంపేట మండలంలోని సంగెం, పోల్కోనిగుట్ట తాండ, ఎక్లాసాఖాన్‌పేట, తులవాని గడ్డ, అల్వాల, పాటిగడ్డ, కేశంపేట గ్రామాలల్లో నిర్వహించారు. ఈ సందర్భగా ప్రోటీన్ విటమిన్ బాక్సులను ఇంటింటికి వెళ్లి గర్భిణీలకు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే చిన్నారులు బాగుంటారని, ఇలాంటి ప్రోటీన్ విటమిన్ తీసుకోవడం వల్ల వారు ఆరోగ్యంగా బలంగా ఉంటారని అన్నారు. నమో మాతృమూర్తి కార్యక్రమాన్ని చేపట్టి పలువురికి అండగా నిలబడటం చాలా సంతోషంగా ఉందని, ట్రస్టు ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పసుల నరసింహాయాదవ్, పాండు రంగారెడ్డి, శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, చందు, రాములు, ప్రశాంత్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుకోవాలి

-మెరుగైన వైద్య సేవలు అందించాలి
-కాయకల్ప ప్రొగ్రామ్ ప్రతినిధి బృందం సభ్యులు

**కోడంగల్, మార్చి 15, ప్రభాతవార్త:** కోడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిని కాయకల్ప ప్రోగ్రామ్ ప్రతినిధి బృందం సభ్యులు బుదవారం తనిఖీ చేశారు.డాక్టర్ నారాయన్‌రెడ్డి అధ్వర్యంలో టీమ్ సభ్యులు ఆసుపత్రిని సందర్శించి అన్ని విషయాలను పరిశీలించారు. మందులు, వైద్య పరికరాలు,వైద్య సేవలు ఎలా అందుతున్నాయోనని గమనించారు. వైద్యులు, నర్సులు, ఉద్యోగులు సిబ్బంది కచ్చితంగా డ్రెస్ కోడ్ పాటించి, ఐడి కార్డులు ధరించాలని సూచించారు.ఆసుపత్రిని ప్రతి రోజు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వైద్య పరికరాలు వాడే విదానం వివరించారు. డాక్టర్ మూర్తి మాట్లాడుతూ కోడంగల్ ఆసుపత్రి జిల్లా స్థాయిలో మెరుగైన ఆసుపత్రిగా ఉందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో కాయకల్ప పథకానికి ఎంపిక కోసం వైద్య బృందం సభ్యులు తనిఖీ చేసి పరిశీలించారని అన్నారు. తుది దశ విచారణలో భాగంగా కోడంగల్‌కు వచ్చినట్లు తెలిపారు. కాయకల్ప పథకానికి ఎంపికైతే మొదటి బహుమతి కింద రూ.15 లక్షలు, రెండో బహుమతి కింద రూ.10 లక్షలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వీణ, సాకెత్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కాయకల్ప టీమ్ సభ్యులు

## మహిళను చంపిన నిందితులకు జీవిత ఖైదు

-సిఐ ఉపేందర్‌ను సిబ్బందిని అభినందించిన ఉన్నతాధికారులు

**తలకొండపల్లి మార్చి15,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని ఒక మహిళను చంపిన కేసులో నిందితులను వెంటనే గుర్తించి వారికి శిక్ష పడేలా చేసిన ఆమనగల్లు సిఐ ఉపేందర్ మరియు ఎస్ఐ వెంకటేష్‌తో పాటు మిగతా సిబ్బందిని జిల్లా అధికారులు అభినందించారు. బుధవారం తలకొండపల్లి ఎస్ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ...రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన చౌటి మైసమ్మ అనే వృద్ధురాలును అదే గ్రామానికి చెందిన బురిగళ్ల దుర్గయ్య ,బురిగళ్ల సంతోషలు తేది 9-01-2019 నాడు ఒంటరిగా వున్న ఆమెను గొంతు నులిమి చంపివేశారు.బురిగళ్ల దురయ్య,బురిగళ్ల సంతోష మధ్య అక్రమ సంబంధం ఉండడంతో మందలించిన చౌటి మైసమ్మను మనసులో పెట్టుకొని హత్య చేసి ఆమెపై ఉన్న బంగారు వస్తువులు అపహరించారు.ఈ కేసును త్వరిత గతిన చేధించి కోర్టుకు కావాల్సిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి శిక్షపడే ట్లుగా సిఐ ఉపేందర్ వ్యవహరించారు.రంగారెడ్డి జిల్లాలోని జిల్లా న్యా యమూర్తి బుధవారం కేసును చేధించి నిందితులకు జీవిత ఖైదు మరి యు 10వేల రూపాయల జరిమానా విధించారు.ఈ కేసుపై చురుగ్గా వ్యవహరించిన సిఐ ఆమనగల్లు ఉపేందర్,ఎస్ఐ వెంకటేష్ ,సిబ్బంది అవినాష్ కుమార్, శ్రీనివాస్,టైటాస్,శ్రీశైలంలను ఎసిపి షాద్‌నగర్,డిసిపి మరియు సిపి సైబారాబాద్ గార్లు అభినందించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**మేడ్చల్, మార్చి 15. ప్రభాతవార్త :** మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలో నివాసముంటున్న కరిర్రెపాపల దీపక్ (28) కోకకోలా కంపనీలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతని భార్య మంగ స్థానిక పద్మావతి హోమ్స్‌లో గత నాలుగు సంవత్సరాలుగా వాచ్‌మెన్‌గా పని చేస్తున్నది. ఈ మద్య కాలంలో దీపక్ మద్యానికి బానిస అయ్యాడు. దీంతో ఇంట్లో గత కొంతకాలంగా గొడువల జరుగతున్నాయి. ఈ నెల 14న ఉదయం పనికని వెళ్లి రాత్రి 10 గంటల అనంతరం మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యను చితకబాదాడు. దీంతో ఆమె అదే రాత్రి మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద గల సోదరుని ఇంటికి వెళ్లి మరుసటి రోజు ఉదయం వచ్చిన ఆమెతో మరోసారి గొడువకు దిగి అతను ఇంటి నుండి వెళ్లిపోయాడు. 15న సాయంత్రం ఆమె కొడుకును తీసుకువరావడానికి పాఠశాల వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఆమె మరుదలు ఫోన్ చేసి దీపక్ ఇంట్లో ఉరి వేసుకున్నాడని తెలుపగా ఆమె వచ్చి చూడగా చీరతో అతను ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

# సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంటును విధుల్లోకి తీసుకోవద్దు

-మండల పరిషత్ కార్యాలయం ముందు ఉపాధి కూలీల ఆందోళన



ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

**పెద్దేముల్, మార్చి 15, ప్రభాతవార్త:** గత రెండు ఏళ్ళ క్రితం సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల్లోకి తీసుకోవద్దని ఉపాధి కూలీలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బుదవారం మండల పరిషత్ కార్యాలయంలో యంపిడిఓ లక్ష్మప్పకు వినతి పత్రం అందజేశారు. పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో ఉపాధి హమి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బంటు క్రిష్ణను రెండు సంవత్సరాల క్రితం ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి 2022 వ సంవత్సరం వరకు పంచాయతీ కార్యదర్శి ఆధీనంలో ఉపాధి పనులు కొనసాగించారు. గోపాల్‌పూర్ సర్పంచ్, వార్డు సభ్యుల తీర్మాణంతో గ్రామానికి చెందిన బోయిని రవిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. అయితే సస్పెండ్ అయిన బంటు క్రిష్ణ ఉపాధి పనుల కూలీల వద్దకు వెళ్ళి తానే ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్నానని,తాను చెప్పినట్లు వినాలని, లేనిచో వర్క్ ఆర్డర్ వచ్చిన తరువాత మీ సంగతి చెబుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని కూలీలు పేర్కొన్నారు. సస్పెండ్ అయిన బంటు క్రిష్ణను విధుల్లోకి తీసుకోకూడదని, గ్రామ పంచాయతీ తీర్మాణించిన బోయిని రవిని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పిర్యాదులో పేర్కొన్నారు.

## సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ శ్రీకారం

- ఇరుకు దారుల విస్తరణకు అందరూ సహకరించాలి



పోస్టాఫీస్ వద్ద కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి

**నందిగామ మార్చి15,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన నందిగామ గ్రామపంచాయతీలోని 7,8 వార్డులలో సిమెంట్ రోడ్డు నిర్మాణాలు చక చక సాగుతున్నాయి.పోస్ట్ ఆఫీస్ కార్యాలయం మొదలుకొని మాల్లోల్ల పోచమ్మగుడి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ జిల్లెల వెంకట్ శ్రీకారం చుట్టారు.కాలనీలో ఇరుకుగా ఉన్న రహదారుల విస్తరణకు కాలనీ వాసులందరూ సహకరించాలని,అందరూ సహకరిస్తేనే రోడ్లు సౌకర్యవంతంగా మారుతాయన్నారు.కాలనీలలో సిమెంట్ రోడ్లు వేదయం పట్ల ..కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా కాన్షిరాం 89వ జయంతి



కాన్షిరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**శంకర్‌పల్లి, మార్చి 15, ప్రభాతవార్త :** కాన్షిరాం 89వ జయంతి కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనమైన పూలమాలలతో ఉత్సహంగా జయంతి కార్యక్రమాలు జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు చనగళ్ల నర్సింలు మందుమూల లక్ష్మయ్య బహుజన సమాజ్ పార్టీ సింగపల్లి మండల అధ్యక్షులు ఆశల నాగేష్, మండల అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు బండారి బాలకిషన్ ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ కాడిగల ప్రవీణ్‌కుమార్, ఎమ్మారీ ్పఎస్ అధ్యక్షులు ఆర్సిగల్ల గండయ్య, ఆలిండియా అంబే ద్కర్ సంఘం నాయకులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎంబీఏ కోఆర్డినేటర్ రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చాకలి మల్లేశం, కోడి లింగమయ్య, టీచర్ లక్ష్మ య్య, జై.నర్సింలు, రాములు తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**యాచారం, మార్చి 15 ప్రభాతవార్త** మండలంలోని నందివనపర్తి, అయ్యవారిగూడ, నజ్దిక్ సింగారం ఫీడర్ విద్యుత్ మరమ్మత్తు పనులు, విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున నేడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**యాచారం, మార్చి 15 ప్రభాతవార్త** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిటిసి తాండ్ర లక్ష్మమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ఉపసర్పంచ్ మేకల యాదగిరిరెడ్డి, డాక్టర్ మౌనికతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమున్న వారికి కళ్లద్దాలతో పాటు మందులు అందజేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారిని గుర్తించి కంటి ఆపరేషన్లు చేయనున న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుంటి పాండు యాదవ్, కార్యదర్శి రాంబాబు, వైద్య సిబ్బంది శివాని, అజీమ్, ఎఎన్ఎం పారిజాత, ఆశా వర్కర్ నర్సమ్మతో పాటు గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


**IN THE COURT OF HON'BLE Addl. JUNIOR CIVIL JUDGE Cum-VII M.M. RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR O.S. No. 194 of 2023**

Between:
1. **HASEENA,** W/o. Late shaik khasim vali, Aged about 42 Years, Occ: Housewife, R/o Plot no. 102/1, Jnnurm colony, Kavadpalli, Abullapur met Mandal, Ranga Reddy District
2. **AFREEN SHAIK,** D/o Late Shaik khasim vali, Aged about 22 years, Occ: House wife, R/o. 3-17-187/541, Nallabanda Street, Giddalur, Prakasham District, Andhra Pradesh.
3. **SHAIK ALLAHBAKASH,** S/o Late Shaik khasim vali, Aged about 19 yeaqrs, Occ: Student, R/o H.NO. 2-2-115/41, Pochamma Basthi, Amberpet, Hyderabad. ...Plaintiffs

AND

1. **THE TAHSILDAR,** Abullapurmet Mandal, Ranga Reddy District
2. **All Concerned** ...Defendants

**NOTICE**

Please take Notice, that the above case is filed by the plaintiffs against Defendants for Declaration to Declare the plaintiffs Legal heirs of the deceased Late Shaik Khasim Vali, S/o. Shaik Thummali ,vide O.S.No. 194 of 2023. That the suit scheduled property is to the extent of Eastern Part of Ploy No. 467, Admeasuring 112.65 sy.yds and Western part ( East Side ) Plot No. 467, Admeasuring 37.5 sy.yds together 150 sy.yds ort 125.41 sy.mts out of 225 sy.yds in Sy.Nos. 60, 74, 75, & 76, Situated at Munuganoor Village, Abdullapurmet Mandal, Under turkayamjal Municipality, Rangareddy District, having boundaries, NORTH:30 Feet Wide Road, SOUTH: PLOT No. 468, EAST: 30 Feet Wide Road, WEST: Plot no. 447 Western Part (West Side) and the same stands posted on 14.04.2023 for your appearance, either by personally or through your counsel on the above said date before the Hon'ble Addl Junior civil judge -cum- VII M.M. Ranga Reddy District , at Hayathnagar, otherwise the case will be decided as per due process of law. Hence this Notice.

[By Order of the Court]
**MOHAMMED ZUBAIR AKRAM**
Advocate,
# 2-3-717, Lalbagh, Amberpet, Hyderabad
Ph: 9949862999

## సిసి రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలి



ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి : ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాలలో చేపట్టిన సిసి రోడ్ల పనులన్నింటిని మార్చి మాసాంతం వరకు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి పంచాయతీరాజ్ ఇఇ శ్రీనివాస్ రెడ్డితో కలిసి సిసి రోడ్ల నిర్మాణ పనులపై పంచాయతీ రాజ్ ఏఇలు ,డిఇలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలలో మంజూరైన సిసి రోడ్ల పనులను వేగవంగం చేసి మార్చి మాసంతం వరకు పూర్తి చేయాలన్నారు.ఇప్పటి వరకు మంజూరైనప్పటికి ప్రారంభం కాని పనులను కూడా వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు.చేపట్టిన పనులకు సంబందించి చెల్లింపుల కోసం ఈ మాసం 20 లోపు వెంటనే ఎఫ్‌టిఓలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.

## పేదలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్ : మంత్రి మల్లారెడ్డి


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 15, ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపలిటీ కు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంతో దయార్ద్రహృదయంతో పేదలు ఆస్పత్రుల్లో చేరి అప్పులపాలు కాకుండా తన ఫండ్‌ను మంజూరు చేసి ఆదుకుంటున్నారని అన్నారు. పోచారం మున్సిపలిటీ కు చెందిన స్వర్ణలతకు 30 వేల చెక్కు, బి. రేణుకకు 12 వేల 500 రూపాయల చెక్కును, ఇస్తాక్ బేగంకు 25 వేల చెక్కును మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, బాలగోని వెంకటేశ్ గౌడ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, బి. హరిప్రసాదరావు, ఎస్. రవీందర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. అక్రం అలీ, బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. బాలేశ్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, మోటుపల్లి శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, నర్ర కాశయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

-డీఎల్పీఓ శంకర్‌నాయక్


హరితవనం మొక్కలను పరిశీలిస్తున్న డిఎల్పిఓ.

కొడంగల్,మార్చి15,ప్రభాతవార్త : కొడంగల్ మండలం అంగడిరైచూర్,చిట్లపల్లి గ్రామాలలో డిఎల్పిఓ శంకర్‌నాయక్ బుధవారం నాడు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం తడి చెత్త,పొడి చెత్త,నర్సరీ పల్లెప్రకృతివనం,గల్లీల పరిశుభ్రం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులు నిర్లక్ష్యం వహిస్తేచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.అన్నారం గ్రామంలో ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి కళ్ల అద్దాల పంపిణీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్‌రాజ్,ఎంపీడీఓ పాండు,ఎపిఓ శ్రీనివాస్,మల్లికార్జున్,శైలజ,మల్‌రెడ్డి,సర్పంచ్ అనిత పకీరప్ప,పంచాయతీ కార్యదర్శి వరుణ్, ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజుల బాదుడుకు స్వస్తి పలకాలి

-హిపో్ప క్యాంపస్ యజమానులకు పేరెంట్స్ మొర

నందిగామ మార్చి15,ప్రభాతవార్త : అడ్మిషన్ల పేరుతో హిపో్ప క్యాంపస్ యజమానులు అధిక ఫీజులు వసూల్ చేయడంతో మారుమూల గ్రామీణ ప్రాంతం సామాన్యులపై మోయలేని భారం పడుతుందని,ఫీజుల బాదుడు తక్షణమే తగ్గించాలని బుధవారం రంగాపూర్ పరిసర ప్రాంతాల గ్రామీణులు మొర పెట్టుకున్నారు. రంగాపూర్ సర్పంచ్ ఎనుగొండ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో హిపో్ప క్యాంపస్ యాజమాన్య ప్రతినిధులతో సమావేశమైయ్యారు.ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయమని చెప్పి,మాట ఇచ్చి ఇప్పుడు మాట మార్చడం సమంజసం కాదని నాట్కో ట్రస్ట్ యాజమాన్యంపై విద్యార్థుల తల్లీదండ్రులు నిప్పులు చెరిగారు. గతంలో నాట్కో యాజమాన్యం మాదిరి హిపో్ప క్యాంపస్, యాజమానులు సామాన్యుల పట్ల ఊదరా స్వభావాన్ని చాటుకోవాలని సర్పంచ్ పదే పదే నచ్చజేప్పారు.నాణ్యతమైన విద్యతో పాటు పిల్లల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటునందించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని హిపో్ప యాజమాన్యాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో నందిగామ సింగిల్ విండో చైర్మన్ తోట రాజ్ గోపాల్,ఉప సర్పంచ్ భర్తచంద్రశేఖర్,గ్రామపంచాయతీ సభ్యులు కల్వకోలు శేఖర్ గౌడ్,శ్రీనివాస్,గ్రామస్థులు,కోంగర మహేష్, దేవేందర్,శ్రీను చారి,తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి గ్రామంలో పర్యటించిన ఎంపీడీవో విజయలక్ష్మి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

యాచారం, మార్చి 15 ప్రభాతవార్త
మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఎంపీడీవో విజయలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయితీ పనులను పరిశీలించారు. పల్లె ప్రగతి పనులు, నర్సరీ, కంపోస్టు షెడ్ పనుల పరిశీలించడంతో పాటు ఆఫీస్ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్,ఈసీ,కార్యదర్శి పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన వడ్ల నందు

వికారాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:
దారూర్ మండలం, కొండాపూర్ కలాన్ గ్రామానికి చెందిన కరీంపూర్ అనంతయ్య బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వడ్ల నందు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ యువ నాయకులు వడ్ల నందు రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా వడ్ల నందు మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని, ప్రభుత్వ పరంగా రావాల్సిన పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తానని మృతుడి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ కలాన్ సర్పంచ్ పరమేష్, నాయకులు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు రాగి అంబలి అందజేత


విద్యార్థులకు అంబలి అందిస్తున్న దాత

బొంరాస్‌పేట్,మార్చి15,ప్రభాతవార్త :
మండల పరిషత్ పాఠశాల మెట్లకుంట గ్రామంలో విద్యార్థులకు వేసవికాలం సందర్భంగా రాగి అంబలి అందించే కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య గౌడ్ అధ్వర్యంలో దాత అమీరోద్దీన్ సహకారంతో బుధవారం నాడు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జీఎచ్ఎం పాపిరెడ్డి,ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, నరేందర్,శిసిందర్, నర్సిములు,సర్పంచ్ నారాయణ,కాంగ్రేస్‌పార్టీ నాయకులు జయకృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ వెంకటయ్య, మల్లేషం, సిఆర్‌పిలు, గ్రామపెద్దలు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

కుల్కచర్ల మార్చి15,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ భగవంతుని పట్ల భక్తిభావంతో మెలగాలని బిజేపి నాయకుడు మారుతి కిరణ్ భూనేటి అన్నారు.బుదవారం కుల్కచర్ల మండల పరిది లోని బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండ బ్రహ్మోత్సవాలలో కుటుంబ సమేతంగా ఆయన పాల్గొని మూలవిరాట్ రామలింగేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో హిందూ దేవాలయాలకు విశిష్ట స్థానం ఉందని దైవానుగ్రహం వల్లే మానవ మనుగడ కొనసాగుతుందని అన్నారు.దైవసన్నిదిలో మానసిక ప్రశాంతతతో పాటు చేసే పనిలో పట్టు పెరుగుతుందని అన్నారు.వికారాబాద్ జిల్లాలోనే ఏకశిలా పర్వతంగా ఆద్యాత్మిక క్షేత్రంగా పాంబండ దేవస్థానం పేరు గడించిందని తెలిపారు.మరో రెండు రోజుల్లో మరోసారి ఆలయాన్ని దర్శించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజేపి మండల పార్టీ అద్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్, బిజెవైఎం మండల అద్యక్షుడు గడుసు మహిపాల్,మాజి సర్పంచ్ జానకిరామ్ చౌహన్,ఆలయ కమిటి చైర్మన్ రాములు,అర్చకులు పాండు,దశరథం, కమిటి సభ్యులు సంజయ్‌గౌడ్ మరియు బిజేపి నాయకులు పాల్గొన్నారు.


పాంబండ ఆలయంలో పూజలు నిర్వహించిన బిజేపి నాయకులు

# మానవతా దృక్పథంతో పని చేయాలి

## -జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :
మానవతా దృక్పథంతో పనిచేసి రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు, రైతుబంధు డబ్బులు అందేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.బుధవారం టెలికాన్ఫెరెన్స్ ద్వారా ఆర్డివోలు,తహసీల్దారులతో చేపడుతున్న ధరణి పనులపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాదాపు నెల రోజుల నుండి రెవెన్యూ సిబ్బంది అందరూ కష్టపడి పనిచేసి ఎక్కువ మొత్తంలో ధరణి సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు.అర్హులైన రైతులను గుర్తించి వారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు మనసుపెట్టి పనిచేసి వారికి న్యాయం చేయాలని సూచించారు.తప్పుడు పనులు చేసి ఇబ్బంది పడవ్వదని ,క్లియర్ టైటిల్,పొజిషన్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంకల్పం మేరకు ధరణి ద్వారా భూ సమస్యల పరిష్కారం కావాలి తప్ప,కొత్త సమస్యలు సృష్టించరాదన్నారు.ఒక రెవెన్యూ అధికారికి తప్పు చేసినట్లు చెడ్డ పేరు రాకుండా అందరూ బాగా పని చేయాలని సూచించారు.ఒక పట్టాదారుకు సంబంధించిన ఒక గుంట భూమి కూడా అన్యాయంగా ఇంకొకరికి మార్చకూడదని సూచించారు.ప్రభుత్వానికి సంబంధించిన అసైన్డ్ భూములు,దేవాదాయ భూములు,వక్ఫ్‌భూములు ఎక్కడైనా పొరపాటున పట్టా భూములుగా పడినట్లయితే వాటిని గుర్తించి సరిచేసి సంరక్షించాలన్నారు.కోర్టు కేసుల విషయంలో పూర్తి జాగ్రత్తలు వహించి పరిశీలించినకనే ముందుకు వెళ్లాలన్నారు.ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఎతైనా ఉందని కలెక్టర్ తెలియజేశారు.ధరణి సమస్యల పరిష్కారానికి సంబంధించిన నివేదికలు,రికార్డులను కలెక్టర్‌కు పంపేటప్పుడు స్పష్టంగా తప్పులు లేకుండా జాగ్రత్తగా అందించాలన్నారు.జిఎల్ఎమ్,సక్సెషన్ పనులకు తప్పనిసరిగా 2010 సంవత్సరపు పహానిలను జతపరచాలని సూచించారు.వచ్చే రెండు నెలలు కష్టపడి పని చేసినట్లయితే దాదాపు అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ తెలిపారు.

# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం....

షాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :
తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో 11 గ్రామపంచాయతీల నుండి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాచన్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ జెండాను జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. షాబాద్ మండలంలో చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో నెలకొన్న పరిశ్రమల వల్ల యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. ఎన్నికల ముందు వచ్చే పగటి వేశగాళ్లను నమ్మి మోసపోవద్దన్నారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ రావు, ఏఎంసీ మాజీ చైర్మెన్లు వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు పొన్న నర్సింహ్మారెడ్డి, యాదయ్య, శేఖర్‌రెడ్డి, గోపాల్‌నాయక్, కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, సర్పంచులు మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణలతసతీష్‌యాదవ్, రమ్యకృష్ణ,రాంచెంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లేష్, మంగమ్మ, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**- తొలి రోజు 113మంది విద్యార్థుల గైర్హాజరు - నిమిషం నిబంధనతో 6గురు విద్యార్థులు పరీక్షకు దూరం**


పరీక్షకేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు


కేంద్రం వద్ద గదుల నంబర్లను వెతుక్కుంటున్న విద్యార్థులు

తాండూరు, మార్చి 15, ప్రభాతవార్త :
తాండూరులో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 113మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని తాండూరు పట్టణంలో 8పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకేషనల్ విద్యార్థుల కోసం రెండు పరీక్ష కేంద్రాలు, జనరల్ విద్యార్థులకు 6 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఒకేషన్ విద్యార్థులకు సంబంధించి హైదరాబాద్ రోడ్డు మార్గంలోని టీఎంఆర్జెసీ, టీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలను, జనరల్ విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండు కేంద్రాలు, సింధూ బాలికల జూనియర్ కళాశాల, అంబేద్కర్ ఒకేషనల్, సిద్దార్థ, చైతన్య కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అధికారుల నిబంధనలు ఉండటంతో విద్యార్థులు ముందుగానే కళాశాల వద్దకు చేరుకొని నోటీసు బోర్డులపై తమకు కేటాయించిన గదులను సరిచూసుకున్నారు. అయితే, తొలి రోజు 113మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కస్టోడియన్ మల్లినాథ్ తెలిపారు. మొదటి పరీక్షకు 2749మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 2636మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని అన్నారు. జనరల్ విభాగంలో 2111 మంది హాజరు కావల్సి ఉండగా 2028మంది విద్యార్థులు హాజరయ్యారని, ఒకేషనల్ విభాగంలో 638మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 608మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. మరోవైపు నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అధికారుల నిబంధనలు ఉండటంతో 6గురు విద్యార్థులు మొదటి పరీక్షకు దూరమయ్యాడు. పట్టణంలోని సింధూ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి 6గురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని అనుమతించలేదు. దీంతో వారు ఆవేదనతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

## బిజెవైఎం ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం


మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెవైఎం నాయకులు

మేడ్చల్, మార్చి 15. ప్రభాతవార్త :
టిఎస్‌పిఎస్‌యు పేపర్ లీకేజ్‌కు బాద్యులైన వారిని గుర్తించి శిక్షించాలని, అదే విదంగా బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రసాద్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ బిజెవైఎం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బిజెవైఎం నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మబలిదానంతో ఏర్పడిన తెలంగాణలో ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయలేదని, ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆరోపించారు. లేకలేక విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అవకతవకులు జరుగడం దురదృష్ణకరమని అన్నారు. టిఎస్‌పిఎస్‌యూలో జరిగిన పేపర్ లీకేజితో 30 లక్షల మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. టిఎస్‌పిఎస్‌యూ చైర్మన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, రాగం అర్జున్ మేడ్చల్ బిజెవైఎం ఇంచార్జ్ శ్రీధర్ ముదిరాజ్, నాగసాయి, రాజేష్, రాజానంద్, కేశవరెడ్డి, చేతన్, భరత్, బాలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్, మార్చి 15 , (ప్రభాతవార్త) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో భాగంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 8వ వార్డు యువనాయకుడు సుధీర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో కౌన్సిలర్ శాంతమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ తనయుడు, యువ నాయకుడు సుదీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలకు ఈ కంటి వెలుగు ఎంతో ఉపయోగపడుతుందని, వార్డులోని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు నరహరి, శ్రీనివాస్, శిరీష, మంజుల, మున్సిపల్ సిబ్బంది కిరణ్మాయి, కాలనీ వాసులు జయప్రకాష్, అబ్దుల్లా, వేణుగోపాల్, శేఖర్, అజ్జు, రుద్విన్, రమేష్, రమణ, అనీల్, మల్లేష్, లింగం, ప్రసాద్, కృష్ణవేణి, సాయికృష్ణ, రాంరెడ్డి, వసీమ్, సాయి, నిజాం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.


కంటి వెలుగు కార్యక్రమంలో అద్దాలను అందజేస్తున్న సుదీర్.

## యాసంగి పంటల పరిశీలన


రైతులకు సూచనలు చేస్తున్న ఎడిఎ శంకర్

బొంరాస్‌పేట్,మార్చి15,ప్రభాతవార్త :
ఎడిఎ శంకర్ బొంరాస్‌పేట్ మండలం నాజ్‌ఖాన్‌పల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు.యాసంగిలో రైతులు సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించి అవసరమైన సూచనలను చేశారు.ప్రస్తుత పరిస్థితులలో వరిపంటలో అగ్గితెగులు గమనించడం జరిగిందని నివారణ కోసం 0.6 గ్రా,ట్రైసైక్లోజోల్,1.5మి,లీ ఐసోప్రొథైయెలిన్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో ఎఈఓ హేమరెడ్డి,రైతులు పాల్గోన్నారు.

## బిఎస్‌పి నియోజకవర్గ ఇంచార్జ్‌గా నర్మద కిష్టప్ప


నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు.

కొడంగల్,మార్చి15,ప్రభాతవార్త :
హైదరాబాద్‌లో బిఎస్‌పి పార్టీ ప్రధాన కార్యలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి) కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా అంగడిరైచూర్ నర్మద కిష్టప్పకు నియామక పత్రాన్ని అందించి ఆమేను అభినందించడం జరిగింది.పార్టీ సిద్ధాంత భావజాలాన్ని,బలోపేతం కోసం కృషిచేస్తానని అన్నారు.తనను నియోజకవర్గ ఇంచార్జీగా నియామించిన రాష్ట్ర అధ్యక్షులు,పెద్దలకు ఆమే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గోన్నారు.

## మాతా శిశు సంరక్షణకు న్యూట్రిషన్ కిట్

-మండల వైద్యాదికారిణి మాధురి,కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్


కార్యక్రమంలో పాల్గొన్న పిహెచ్‌సి సిబ్బంది,ఆశాలు

కుల్కచర్ల మార్చి15,ప్రభాతవార్త :
మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని మండల వైద్యాదికారిణి డాక్టర్ మాధురి,కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు.బుదవారం కుల్కచర్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్బిణలకు కిట్‌లను అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గర్బిణి స్రీలలో వచ్చే రక్తహీనతను అరికట్టడానికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం ద్వార అందించే న్యూట్రిషన్ కిట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కిట్‌లో 7రకాల వస్తువులతో కూడిన బ్యాగ్ ఇవ్వడం జరుగుతుందని ప్రొటీన్లు,విటమిన్‌లు,మినరల్స్‌ను పోషక ఆమరం ద్వార అందించి రక్తహీనతను తగ్గించడం హిమోగ్లోబిన్ శాతం పెంచడం ఈ కిట్ లక్ష్యమని ఈ కిట్ మార్కెట్ విలువ 1962 రూపాయలు ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ఉవ్వబడతాయని తెలిపారు.మొదటి కిట్‌ను 14 వారాల నుండి 27 వారాలు ఉన్నవారికి పిహెచ్‌సిలోనే ఇవ్వడం జరుగుతుందని 28 వారాల నుండి 34 వారాల వరకు సిహెచ్‌సి పరిగిలో ఇస్తారని వారు తెలిపారు.మూడవ విడుతలో బాగంగా కుల్కచర్ల పిహెచ్‌సికి 74 కిట్లు వచ్చాయని వీటిని 8 ఆరోగ్య ఉపకేంద్రాలకు చెందిన గర్బిణులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా బలపడాలి

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, మార్చి 15 , (ప్రభాతవార్త) :
మహిళలు ఆర్థికంగా బలపడాలని, వారి అభివృద్ధి కోసం తెలంగాణ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎఫ్‌సీఎన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేయడం జరిగిందని ఫౌండేషన్ నిర్వహకులు థామస్ దంపతులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... సామాజిక సేవలను నిరంతరం చేపడుతున్న ఫౌండేషన్ వారి గొప్ప మనస్సుకు తన అభినందనలు ఎప్పుడు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబమైన, రాష్ట్రమైనా, దేశమైన బాగుంటాయని అన్నారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీష్వ రామకృష్ణ పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నిర్వహకులు.